క్లుప్తంగా

నేడు రైతు భరోసా కేంద్రం ప్రారంభం

చాపాడు : చాపాడు మండలంలోని అల్లాడుపల్లిలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయాధికారి మ్యాగి తెలిపారు. ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి గ్రామ సచివాలయ పరిధిలోని అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఆమె కోరారు.

నేడు మున్సిపల్ సాధారణ సమావేశం

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో పలు అభివృద్ధి అంశాలపై కౌన్సిల్ సభ్యులు చర్చించి ఆమోదిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిల్ సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి


ఫ్రేమ్‌లను అందిస్తున్న అవోపా ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మహిళలు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని అవోపా మాజీ జిల్లా అధ్యక్షుడు గాదంశెట్టి గోపాల్‌రావు అన్నారు. స్థానిక ఆర్యవైశ్య అఫిషియల్, ప్రొఫెషనల్స్ కార్యాలయంలో ఆదివారం అవోపా ప్రతినిధులు ఉచిత మగ్గం వర్క్, కోలాటం శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మగ్గం వర్క్ నేర్చుకోవడం ద్వారా ఇంటి వద్దే ఉంటూ ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా మగ్గం వర్క్‌లో శిక్షణ పొందే మహిళలకు ఉచితంగా ఫ్రేమ్, స్టాండ్లను అందజేశారు. కార్యక్రమంలో అవోపా అధ్యక్షుడు గుండా పద్మనాభరావు, సెక్రటరీ నరసింహారావు, ట్రెజరర్ సురేష్‌బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజా, వరలక్ష్మి, పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మృతి


మాబుసాహెబ్ (ఫైల్)

మైదుకూరు : వైఎస్సార్‌సీపీ నాయకుడు, మైదుకూరు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుడిపాడు మాబుసాబ్ (75) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. కొన్నాళ్లుగా కడపలోని ఆయన కుమారుని ఇంటిలో ఉంటున్న మాబుసాహెబ్‌కు ఆదివారం ఉదయం 10.30 గంటలకు గుండెపోటు రాగా ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆరేళ్ల కిందట ఆయన మైదుకూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన మృతి పట్ల వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

పులుల సంరక్షణపై అవగాహన


వరికుంట్లలో పులుల గురించి వివరిస్తున్న అటవీశాఖ అధికారులు

కాశినాయన : మండలంలోని వరికుంట్ల గ్రామంలో పులుల సంరక్షణపై అటవీ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రకృతి సమతుల్యత–పులి మనుగడ అనే అంశంపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బీట్ అధికారులు దస్తగిరి, బ్రహ్మయ్యలు మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లో ఉన్న పులులలో 75 శాతం మన దేశంలో ఉన్నాయన్నారు. వన్య మృగాల్లో విశేషమైనదిగా భావిస్తున్న పెద్దపులిని మనదేశం జాతీయ జంతువుగా గుర్తించిందని తెలిపారు. కార్యక్రమంలో అటవీ అధికారులు పాల్గొన్నారు.

పురందేశ్వరి విభజన హామీలపై మాట్లాడాలి

పులివెందుల రూరల్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి విభజన హామీలపై మాట్లాడితే బాగుంటుందని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్ కోరారు. ఆదివారం ఆయన దూదేకుల సంఘ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంను విమర్శించే నైతిక విలువలు పురందేశ్వరికి లేవన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఏపీకి 25 రకాల హామీలు ఇచ్చారన్నారు. ఇందులో ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ బాధ్యత, విశాఖ చెన్నై పారిశ్రామిక కారిడార్, రాయలసీమ ఉత్తరాంధ్ర వెనుబడిన జిల్లాల అభివృద్ధికి, ప్రత్యేక ప్యాకేజీ మరికొని ఉన్నాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు అవుతున్న ఇంతవరకు ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ మీద పురందేశ్వరికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే విభజన అంశాలపై పోరాడితే ప్రజలు హర్షిస్తారన్నారు.

ఆడుతూ పాడుతూ పనిచేస్తుంటే..


వరినాట్లు వేస్తున్న కూలీలు


వరినాటుకు పొలాన్ని ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న దృశ్యం


వరినారుమడిలో గట్లను కొడుతున్న రైతు


నాటుకు సిద్ధంగా ఉన్న వరినారు

కలసపాడు : గత నాలుగు సంవత్సరాలుగా వర్షాలు బాగా కురిసాయి. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. ఇప్పటికీ కొన్ని చోట్ల చెరువుల్లో నీళ్ళు ఉన్నాయి. దీంతో బోరుబావులు ఫుల్ రీఛార్జ్ కావడంతో పుష్కలంగా నీళ్ళు వస్తున్నాయి. రైతులు సేద్యం ప్రారంభించారు. బోరుబావుల కింద పంటల సాగు పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. పచ్చని పందిరిలా ఉన్న పొలాల్లో కూలీలు ఆనందంగా పనులు చేసుకుంటున్నారు. పాటలు పాడుతూ వరినాట్లు వేస్తున్నారు. తోటి మనుషులతో ఉల్లాసంగా గడుపుతూ కష్టాన్ని మరిచిపోతున్నారు. ఆదివారం కలసపాడు మండలంలోని సిద్ధమూర్తిపల్లె సమీప పంట పొలాల్లో సేద్యం పనుల్లో మునిగిన కూలీలు.

● ఆదు'కుందు'వా!


కుందూనదిలో అరకొరగా పారుతున్న నీరు

రాజుపాళెం : కుందూ నదిలో అరకొరగా వస్తున్న నీటిని, బోరు నీటిని నమ్ముకుని అక్కడి రైతులు పలు పంటలు సాగు చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు దాటినా వర్షాలు అంతంత మాత్రమే కురిశాయి. అయితే రాజుపాళెం మండలంలోని టంగుటూరు గ్రామ రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తే మరింత ఆలస్యమవుతుందని కుందూ నది నీటిని, బోరు నీటిని నమ్ముకుని పసుపు, పత్తి మొక్కజొన్న, మినుము, నారుమడులను సాగు చేశారు. నీటి సౌకర్యం లేని పాడి రైతులు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు కౌలు చెల్లించి పశువులకు గడ్డిని కూడా పెంచుకుంటున్నారు.




సాగులో ఉన్న పంటలు

చేనేతల ఆర్థిక బలోపేతమే సీఎం లక్ష్యం


సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చేనేత కార్మికులు

ఖాజీపేట : చేనేతల కష్టాలను గుర్తించిన సీఎం జగన్ మోహన్ రెడ్డి వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి అన్నారు. నేతన్న నేస్తం ద్వారా చేనేతలకు రూ. 24వేలు అందించిన సందర్భంగా రంగాపురం గ్రామంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి చేనేత కార్మికుడికి రూ 24వేలు అందించామన్నారు. ఒక్క రంగాపురం పంచాయతీలోనే నేతన్న నేస్తం ద్వారా కోటి యాభైలక్షలు వచ్చిందని అన్నారు. అందుకే మన సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వానికి మనం దరం అండగా ఉండాలని సూచించారు. అనంతరం సీఎం జగన్ చిత్రపటానికి చేనేత కార్మికులు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్, సర్పంచ్ పట్టుపోగుల లక్ష్మయ్య, ఎంపీటీసీ బండి శ్రీనివాసులు, పూజల వెంకటరమణ, అగ్రహారం సొసైటీ అధ్యక్షుడు రాఘవరెడ్డి, మైదుకూరు మార్కెట్ యార్డు కమిటీ అధ్యక్షుడు శ్రీమన్‌నారాయణరెడ్డి, ఆప్కో డైరెక్టర్ ఉదయగిరి వెంకటేష్, పట్టుపోగుల శ్రీనివాసులు, అప్పనపల్లె పుల్లగూరు సుబ్బరాయుడు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన దోషులను కఠినంగా శిక్షించాలి


శివాలయం సర్కిల్‌లో ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు

ప్రొద్దుటూరు కల్చరల్ : మణిపూర్‌లో జరిగిన అమానవీయ సంఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆదివారం పట్టణంలోని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ నుంచి శివాలయం సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ మణిపూర్‌లో అమాయకుల ప్రాణాలను బలిగొనడం దారుణమన్నారు. జాతీయ జెండాను చేతపట్టి మణిపూర్‌ను రక్షించాలని, అల్లర్లను వెంటనే ఆపాలని నినాదాలు చేస్తూ పాస్టర్లు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా రాజ్యాంగాన్ని రక్షించాలని పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. శివాలయం సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడి మణిపూర్ ఘటనలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పట్టణంలోని పలు చర్చిల పాస్టర్లు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు హేయమైన చర్య

బద్వేలు అర్బన్ : అట్లూరు మండలం కమలకూరు గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధను ప్రజలు నిలదీశారని కొన్ని ఛానెళ్ళలో అసత్య ప్రచారాలు చేయడం హేయమైన చర్య అని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ మెంబర్ సి.నారాయణ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు దాసరిశ్రీనులు పేర్కొన్నారు. ఆదివారం సిద్దవటం రోడ్డులోని వారి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సుమారు 450 ఇళ్ళు ఉన్న గ్రామంలో 6 ఇళ్ళకు చెందిన వారు మా ఇంటి వద్దకు రావద్దు అని అనడంతో ఎమ్మెల్యే అక్కడికి వెళ్ళలేదని, తిరిగి అదే వ్యక్తులు ఎమ్మెల్యే మా ఇంటి వద్దకు రాలేదని హల్‌చల్ చేశారని అన్నారు.

జరిగిన వాస్తవాలను తెలుసుకోకుండా కొన్ని యూట్యూబ్ ఛానెళ్ళు వక్రీకరించి దుష్ప్రచారాలు చేయడం సరికాదన్నారు. నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యేపైన అసత్య ప్రచారాలు చేయడం ఇప్పటికైనా మానుకోవాలని కోరారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఎన్‌జీఓ అసోసియేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : ఆగస్టులో జరగనున్న ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ 21వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని ఎన్‌జీఓ అసోసియేషన్ తాలూకా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.అమర్‌నాథ్‌రెడ్డి, టీ.నరసింహారెడ్డిలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్‌జీఓ హోంలో నిర్వహించిన తాలూకా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ ఆగస్టు 21, 22వ తేదీల్లో విజయవాడలో జరగనున్న రాష్ట్ర మహాసభలకు నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున ఉద్యోగులు తరలివెళ్ళేలా కార్యాచరణ రూపొందించాలని కోరారు. ఈ మహాసభలకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉద్యోగస్తుల ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డిలతో పాటు రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.శివారెడ్డిలు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ఎన్‌జీఓ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ సాధు వెంకటేశ్వర్లు, ట్రెజరర్ శివరామిరెడ్డి, ఉపాధ్యక్షులు మదన్‌మోహన్, మల్లికార్జునరావు, శ్రీనివాసులరెడ్డి, వెంగయ్య, జాయింట్ సెక్రటరీలు భాస్కర్‌బాబు, హరికృష్ణ, బాలుడు, వెంకటమ్మ, శర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ శివనాగరాజు, శివచంద్ర, స్టేట్ ఈసీ మెంబర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

ఎర్రగుంట్ల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. పట్టణంలో మానవత ఆధ్వర్యంలో చాలా సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆయన కొనియాడారు. అనంతరం కిమ్స్ సవేరా ఆసుపత్రి వైద్య బృందం సుమారు 170 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు సేవచేయడానికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థను స్థాపించామన్నారు. పట్టణంలో సంస్థ నిర్వాహకులు బాగా సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎర్రగుంట్ల మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు రఘరామరెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, గంగాధర్‌రెడ్డి, ఎస్వీ రమణారెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు


చాపాడు : మొహర్రం సంబరాల్లో కుందూ నదికి తరలిపోతున్న పీర్లు


యర్రబల్లిలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం


పీర్లను ఊరేగిస్తున్న భక్తులు


అంబవరంలో స్నానానికి వెళుతున్న పీర్లు

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులో ఆదివారం సాయంత్రం మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. శనివారం రాత్రి పెద్ద సరిగెత్తు కార్యక్రమంలో భాగంగా పీర్లను అగ్నిగుండంలో నడిపించి పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం గ్రామంలో పీర్లను ఊరేగించారు. సాయంత్రం చాపాడు సమీపంలోని కుందూ నది ఏటికి సాగనంపారు. కులమతాలకు అతీతంగా చాపాడు గ్రామ ప్రజలతోపాటు సమీప గ్రామాల్లోని ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

దువ్వూరు : మండలంలోని గుడిపాడు గ్రామంలో ఆదివారం ఘనంగా మొహర్రం వేడుకలను నిర్వహించారు. పీర్లచావిడిలో పీర్లను ప్రత్యేకంగా పూలతో అలంకరించి ప్రార్థనలు చేశారు. పీర్లను ఎత్తుకుని అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం పీర్లను ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు.

అట్లూరు : మండలంలోని యర్రబల్లి గ్రామంలో మొహర్రం పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో మొత్తం 50 కుటుంబాలు అంతా రెడ్డి కులస్తులే. గ్రామంలో ముస్లీం కులస్తులు లేరు. అయినా కులమతాలకు అతీతంగా గ్రామస్తులు ప్రతి ఏటా మొహర్రం పండుగను ఘనంగా నిర్వహిస్తారు. శనివారం రాత్రి పెద్దసరిగెత్తు సందర్భంగా గుండం తొక్కారు. అనంతరం ఆదివారం సాయంత్రం గ్రామస్తులంతా డప్పువాయిద్యాల మధ్య పీర్లను ఊరేగిస్తూ సమీపంలోని సగిలేరు నదికి స్నానానికి తీసుకెళ్ళి మొహర్రం వేడుకలను ముగించారు.

కాశినాయన : మండలంలోని అంబవరం గ్రామంలో ఆదివారం మొహర్రం పండుగను ఘనంగా జరుపుకున్నారు. పీర్లు స్నానానికి వెళుతున్న నేపథ్యంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పీర్లకు బొరుగులు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. పండుగలో వేసిన వివిధ రకాల వేషధారణలు ఆకట్టుకున్నాయి. వరికుంట్ల, బాలాయపల్లె, గంగనపల్లె, నరసాపురం గ్రామాల్లో పెద్దసరిగెత్తు పండుగను జరుపుకున్నారు.

2న వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం సమావేశం

కడప కల్చరల్: డాక్టర్ వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం ప్రత్యేక సమావేశాన్ని ఆగస్టు 2న నిర్వహించనున్నట్లు ఫోరం రాయలసీమ విభాగం కన్వీనర్ కె.చిన్నపరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు వివరించారు. కడప నగరం మానస ఇన్ హోటల్‌లో బుధవారం ఉదయం 10.00 గంటలకు ఈ సమావేశం నిర్వహిస్తామన్నారు. ఇందులో 'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం' అనే అంశంపై మేధావులు ప్రసంగిస్తారన్నారు. కార్యక్రమానికి ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు శాంతమూర్తి అధ్యక్షత వహిస్తారని చెప్పారు.

పోలీసుశాఖ ఖాళీ స్థలాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప అర్బన్: కడప పోలీసు లైన్‌లో పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంకు వద్ద ఖాళీగా ఉన్న పోలీసుశాఖకు చెందిన 30 సెంట్ల స్థలంలో నెలసరి అద్దె ప్రాతిపదికన వాణిజ్య సముదాయాలు, పాఠశాలలు, ఆసుపత్రులు మొదలైన వాటిని నిర్వహించుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ అధికారులు తెలిపారు. చేయబోయే వ్యాపార వివరాలతో స్కెచ్, డ్రాయింగ్‌ల బ్లూప్రింట్ నకలు, కాపీలను దరఖాస్తుకు జత చేసి ఆగస్టు 2న సాయంత్రం 5గంటల లోపు ఆర్.ఐ (వెల్ఫేర్), జిల్లా పోలీసు కార్యాలయం, కడప ఆఫీసులో సమర్పించాలన్నారు. దరఖాస్తుల పరిశీలన తరువాత వేలం నిర్వహణకు తేదీని ఎంపిక చేసి దరఖాస్తుదారులకు తెలియజేస్తారని చెప్పారు. మరిన్ని వివరాలకు ఆర్‌ఎస్‌ఐ కె. రామస్వామిరాజు 94409 41424 నంబరులో సంప్రదించాలని కోరారు.

నేడు ఇన్సూరెన్స్ ఆవశ్యకతపై సదస్సు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగర శివార్లలోని ఊటుకూరు జిల్లా ఉప రవాణా శాఖ కార్యాలయంలో ఆటో రిక్షా యజయానులకు ఇన్స్యూరెన్స్ యావశ్యకత, ఫేక్ ఇన్స్యూరెన్స్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపరవాణాశాఖ కమిషనర్ ఈ.మీరా ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12.30 గంటలకు జరిగే ఈ అవగాహన సదస్సుకు ఆటో రిక్షా యజమానులతో పాటుయూనియన్ నాయకులు హాజరు కావాలని కోరారు.

స్త్రీల మాన, ప్రాణాలను కాపాడండి


నిరసన ర్యాలీలో పాల్గొన్న వైఎస్ మధురెడ్డి తదితరులు

పులివెందుల టౌన్ : స్త్రీల మాన, ప్రాణాలను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వైఎస్సార్ సీపీ నేత, తొండూరు మండల ఇన్‌చార్జి వైఎస్ మధురెడ్డి తెలిపారు. మణిపూర్ సంఘటనపై ఆదివారం పట్టణంలో నిర్వహించిన నిరసన ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మారణహోమంగా మారిన మణిపూర్‌ను కాపాడాలన్నారు. స్త్రీలను గౌరవించే సంస్కృతి మనదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. అనంతరం స్త్రీల మానప్రాణాలను కాపాడుదాం.. స్త్రీలను గౌరవిద్దాం అనే నినాదాలతో పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్దనుండి మెయిన్‌బజార్, పూలంగళ్ల సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, రైడ్స్ డైరెక్టర్ త్యాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు కనిపిస్తే చర్యలు తప్పవు


సమస్యలపై ఆరాతీస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తదితరులు

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీలో ఎవరైనా ప్లాస్టిక్ కవర్లు వాడినా, అమ్మినా వారిపై చర్యలు తప్పవని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వార్డు పర్యటనలో భాగంగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజుల్లా, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డిలతో కలసి పలు దుకాణాలను తనిఖీ చేశారు. మటన్, చికెన్, కూరగాయల అంగళ్లను తనిఖీ చేసి ప్లాస్టిక్ కవర్లను వాడుతున్న వారిని తీవ్రంగా హెచ్చరించారు. మటన్, చికెన్ షాపులకు వచ్చేవారు ఇంటి వద్దనుండే క్యారీ తెచ్చుకున్న వారికి రూ.20 తగ్గింపు ఉంటుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్లాస్టిక్ రహిత పులివెందులగా చూడాలన్నారు. అనంతరం బాకరాపురంలో జరుగుతున్న యూజీడీ పనులను పరిశీలించారు.

మానవత సేవలు విస్తృతం చేయాలి


యశోదను సత్కరిస్తున్న మానవత బృందం

వేంపల్లె : సమాజంలోని అభాగ్యులకు అండగా నిలుస్తూ మానవత సేవలు అందించేలా విస్తృతం చేయాలని మానవత వేంపల్లె మండల శాఖ చైర్మన్ చక్రపాణిరెడ్డి తెలిపారు. ఆదివారం వేంపల్లెలోని శ్రీచైతన్య ఉన్నత పాఠశాల ఆవరణలో ఆసంస్థ సహాయ చైర్మన్ కావలికృష్ణతేజ, నూతన కార్యవర్గం సభ్యులచే మాసాంతర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ కీర్తి పతాక అవార్డు గ్రహీత భవిత దివ్యాంగుల కేంద్రం ఐఈఆర్‌టీ కోటపాటి యశోదను సత్కరించారు. అనంతరం మానవత సేవల ప్రణాళికను తయారు చేసుకుని ఆచరణకు శ్రీకారం చుట్టాలని చక్రపాణిరెడ్డి కోరారు. మానవత సంస్థ బృందం ఆదివారం ఫారెస్ట్ బీట్ అధికారి మధుతో కలసి ఇడుపులపాయలోని నెమళ్ల పునరుత్పత్తి కేంద్రాన్ని సందర్శించి వాటికి అవసరమైన దానాను అందజేశారు. ఇడుపులపాయలోని ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని జ్యోతి తల్లిదండ్రులు చనిపోవడంతో సంస్థ ద్వారా ఆమెకు చేయూత నిస్తామని ఆసంస్థ సభ్యులు హామీ ఇచ్చారు. సంస్థ ఉపాధ్యక్షుడు ముత్యాలయ్య, కార్యదర్శి మను(లైన్‌మెన్), డైరెక్టర్లు రంగారెడ్డి, డాక్టర్ రంగయ్య, రాజారాం, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.